క్లుప్తంగా

అప్పన్నకు కిలో మంచి ముత్యాలు అందజేత



ఈవో కె.సుబ్బారావుకు మంచి ముత్యాలు అందజేస్తున్న బోకం శ్రీనివాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరానికి చెందిన బోకం శ్రీనివాస్ కిలో మంచి ముత్యాలను ఈవో కె.సుబ్బారావుకి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం లోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పరవాడ: కన్నూరు శివారు మడకపాలెం గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం అమ్మవారి సారె ఊరేగింపు అనంతరం కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరగనుందన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు తదితరులు

సబ్బవరం: వేసవిలో పాదచారులు, స్థానికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు అన్నారు. స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్బీఐ మేనేజర్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. సుమారు 1500 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, మామిడి శంకరరావు, పల్ల సత్యనారాయణ, గొంప అశోక్ కుమార్, బర్ల రమణ తదితరులు పాల్గొన్నారు. రోమాల చంద్రశేఖర్ చలివేంద్రం నిర్వహణకు రూ.5 వేలు విరాళం అందించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ముమ్మన దేముడు, చిక్కాల సతీష్

పెందుర్తి: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చినముషిడివాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, పార్టీ 95, 97వ వార్డుల అధ్యక్షుడు చిక్కాల సతీష్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన కల్పిస్తున్న బెహరా నర్సింగ్ కళాశాల విద్యార్థులు

గోపాలపట్నం: బెహరా నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. జీవీఎంసీ 88వ వార్డు నరవ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నవజాత శిశువుల ఆరోగ్యం గురించి స్థానికులకు వివరించారు. నర్సింగ్ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ హిందుమతి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. నరవ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు స్థలంలో ఇళ్లను ఖాళీ చేయాలంటూ నోటీసులు

20 ఏళ్లుగా నివసిస్తున్న తమపై కక్ష కూడదని ఆవేదన

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే..

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఆరు కుటుంబాలు



రజకులపై కూటమి కక్ష



తానాంలో నిరుపేదలు నిర్మించుకున్న షెడ్లు (ఇన్‌సెట్) షెడ్లలో నివాసం ఉంటున్న బాధిత కుటుంబీకులు

మాసిన దుస్తుల్ని ఉతికి, ఇస్త్రీ చేసి ఇతరుల బతుకుల్లో తీవిని పెంచే వృత్తి వారిది. తానాం గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజల ఇళ్లకు వెళ్లి, విడిచిన దుస్తుల్ని తీసుకొచ్చి, ఉతికి, ఆరేశాక వాటిని యజమానులకు అందిస్తూ.. వారిచ్చే ప్రతిఫలంతో బతుకులు వెళ్లదీస్తున్న రజకులు. ఆ ఆరు కుటుంబాలకు కాలనీల్లో ఇళ్లు లేకపోవడంతో చెరువు స్థలంలో షెడ్లు వేసుకుని రెండు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరించారన్న కారణంతో కూటమి ప్రభుత్వం వారిపై కక్ష గట్టింది. చెరువును ఆక్రమించి ఇళ్లు నిర్మించారంటూ.. తక్షణమే వాటిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసింది. దీంతో ఉన్నపాటుగా ఇళ్లను వదిలి ఎక్కడికి పోవాలంటూ బాధితులు వాపోతున్నారు.

పరవాడ:

ఇరవై ఏళ్ల క్రితం తానాం గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదలపై పరవాడ రెవెన్యూ అధికారులు కన్నెర్ర చేశారు. స్థానిక కూటమి నాయకులు ప్రోద్బలంతో చెరువు స్థలంలో చేపట్టిన గృహాలను తక్షణం ఖాళీ చేయాలంటూ ఇటీవల నోటీసులు జారీ చేశారు. దీంతో బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. రెండు దశాబ్దాలుగా నివసిస్తున్న ఇళ్లను ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లేదంటూ కన్నీరుపెట్టుకుంటున్నారు. కూలీనాలీ చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న తమపై రాజకీయ కక్షతో ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

6 కుటుంబాలు.. 9 సెంట్లు

20 ఏళ్ల క్రితం గ్రామంలోని సర్వే నెం.62లో కళ్లంపూడి చెరువులో సుమారు 0.09 సెంట్ల స్థలంలో గ్రామానికి చెందిన పేదారపు రమణమ్మ, కింతాడ నరసింగరావు, అడ్డూరి సన్యాసమ్మ, అడ్డూరి అప్పలనరసమ్మ, మజ్జి రామారావు, పి.నాగప్పారావు అనే నిరుపేద కుటుంబాల వారు షెడ్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి అక్కడే ఉంటూ బతుకు వెళ్లదీస్తున్నారు. వీరికి కాలనీల్లో సొంతిళ్లు లేకపోవడంతో ప్రభుత్వ స్థలంలో షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో గ్రామస్తులు కూడా ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ఊరూరా తిరిగి మాసిన దుస్తులు తీసుకొచ్చి, ఉతికి ఇస్త్రీ చేసి ఇచ్చేవారు. అందుకు వచ్చిన అరొకర ప్రతిఫలంతో కుటుంబాలను నెట్టుకొచ్చేవారు. దీంతోపాటు ఊర్లో కూలి పనులకు వెళ్లేవారు. వీరికి ఎవరితోనూ వివాదాల్లేవు. గత ఎన్నికల్లో తమ బతుకులకు భరోసానిచ్చిన వైఎస్సార్‌సీపీపై కాస్త అభిమానం చూపడమే వీరిపై కూటమి నాయకుల కన్నెర్రకు కారణమయింది.

నోటీసుల మీద నోటీసులు

కుటుంబాలతో సహా నివాసం ఉంటున్న షెడ్లను ఖాళీ చేయాలంటూ ఇటీవల గోడలకు నోటీసులు అంటించారు. స్వచ్ఛందంగా ఖాళీ చేయకపోతే బలవంతంగా కూల్చేస్తామంటూ రెవెన్యూ అధికారుల నుంచి రెండోసారి నోటీసులు వచ్చాయి. దీంతో వీరిలో ఆందోళన మొదలయింది. దిక్కు తోచక తమ బాధను అధికార పార్టీ నేతలకు విన్నవించుకున్నా కనికరించట్లేదు. తమకు ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తే ఇళ్లు ఖాళీ చేసి, అక్కడే గుడిసెలు వేసుకుని బతుకుతామన్నా.. రెవెన్యూ అధికారులు ఆ దిశగా చొరవ చూపట్లేదని బాధితులు వాపోతున్నారు. తాము 2024లో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉండడాన్ని సహించలేని కూటమి నాయకులు కక్ష కట్టి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు పేర్కొంటున్నారు. నిరుపేదలైన తమకు ప్రత్యామ్నాయ స్థలం చూపాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లకు మొరపెట్టుకుంటున్నారు.



ఇళ్లపై రెవెన్యూ అధికారులు అతికించిన నోటీసులు

ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోండి

గత 15 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబాలు అధికారుల్ని వేడుకున్నాయి. తానాం గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటైన ఇళ్లను ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు జారీ చేసిన నోటీసుల నేపథ్యంలో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు ఆధ్వర్యంలో బాధితులు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, పరవాడ తహసీల్దార్ ఎస్వీ.అంబేడ్కర్‌లను సోమవారం కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ రజక కులానికి చెందిన తాము గ్రామంలోని ఓ ప్రభుత్వ స్థలంలో కొన్నేళ్ల క్రితం నివాసాలు ఏర్పాటు చేసుకుని, కూలి పనులు చేసుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి తమపై స్థానిక నాయకులు కక్ష కట్టి వేధింపులకు గురిచేయడమే కాకుండా, ఆ గృహాలను తొలగించాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో వారి అనుచరులు గెడ్డలు, వాగులు, చెరువులను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టినా.. రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని, నిరుపేదలమైన తమ ఇళ్లను కూల్చాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై కక్ష సాధింపు చర్యలను విడనాడి ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, ఆదుకోవాలని ఆ వినతి పత్రాల్లో కలెక్టర్‌ను, తహసీల్దార్‌ను కోరారు.



తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన బాధిత కుటుంబాలు

ఎక్కడికి పోవాలి



నాకు భర్త, ఇద్దరు సంతానం. నేను నా భర్త బట్టలు ఉతకడం, ఖాళీ సమయాల్లో కూలి పనులకు పోయి, అవచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. 20 సంవత్సరాల క్రితం చిన్న షెడ్డు నిర్మించుకున్నాం. ఇల్లు ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఉన్నట్టుండి ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటే మేం ఎక్కడ తలదాచుకోవాలో అంతుబట్టడడం లేదు. అధికారులే ప్రత్యామ్నాయం చూపాలి.

– పాకిలపాటి పార్వతి, బాధితురాలు

వైఎస్సార్‌సీపీకి అనుకూలమనే..



కొంత మంది రజకులు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేయడమే నేరంగా.. కూటమి నాయకులు కక్షపూరిత చర్యలకు సిద్ధమయ్యారు. కూటమి నేతల ప్రోద్బలంతోనే రెవెన్యూ అధికారులు నిరుపేద రజకులకు నోటీసులు ఇచ్చారు. న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులను వేడుకున్నా.. కనికరించలేదు. అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి మా గోడు వెల్లబోసుకుంటాం.

– అడ్డూరి శ్రీనివాసరావు, రజకుల కాలనీ సంఘ ప్రతినిధి

చెరువులో ఇళ్లు చట్ట విరుద్ధం



చెరువు స్థలాన్ని ఆక్రమించి పక్కా గృహాలు నిర్మించడం చట్ట విరుద్ధం. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇళ్లను ఖాళీ చేయాలని ఇది వరకే ఫారం–7 నోటీసులు గృహ యజమానులకు జారీ చేశాం. వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఆక్రమణల తొలగింపునకు ఫారం–6 నోటీసులను జారీ చేశాం. ఇళ్ల యజమానులు స్వతహాగా ఇళ్లను ఖాళీ చేయని పక్షంలో మేమే ఆక్రమణలను తొలగిస్తాం.

– ఎస్వీ అంబేడ్కర్, తహసీల్దార్

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు



ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ విశ్వనాథ్

సబ్బవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఫ్లోరోసిస్ వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ ఎ.విశ్వనాథ్ ఆధ్వర్యంలోని వైద్య బృందం ఈ పరీక్షలను జరిపింది. విద్యార్థులకు ఫ్లోరోసిస్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫ్లోరోసిస్ సర్వేకు అనుబంధంగా కమ్యూనిటీ సర్వేలో భాగంగా గృహాలను సందర్శించి, వారి వివరాలను సేకరించి పరీక్షలు, స్క్రీనింగ్ జరిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.శ్రీనివాస్, సీహెచ్‌వో స్వర్ణలత, పీహెచ్‌ఎన్ రత్నబాయి, ఆరోగ్య సూపర్‌వైజర్లు రాంబాబు, చిన్నతల్లి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 8 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 8 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ హేమావతి అర్జీలు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 17 మంది ఎంపిక



పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

సబ్బవరం: విశాఖలోని మద్దిలపాలెం వీఎస్ కృష్ణ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 17 మంది పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ నెల 4న నిర్వహించిన జాబ్ మేళాలో కళాశాల నుంచి 72 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఫార్మా, ఐటీతో పాటు పలు మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలలో ఈ ఉద్యోగాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు జేకేసీ కోఆర్డినేటర్ బి శంకర్, అధ్యాపకులు అభినందించారు.

బైక్‌ల చోరీ కేసుల్లో జైలు శిక్ష

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో రెండు మోటారు సైకిళ్ల దొంగతనం చేసిన కేసుల్లో ఓ ముద్దాయికి కోర్టు పది నెలల జైలు శిక్ష విధించింది. పెందుర్తి క్రైం ఎస్‌ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అంపోలు కిషోర్ అనే వ్యక్తి 2024లో రెండు చోట్ల బైక్‌లను దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితుడ్ని పట్టుకుని నగరంలోని ఏడవ ఏజేఎంఎఫ్‌సీ కోర్టులో ప్రవేశపెట్టారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మాది ఆయా కేసుల విషయంలో 5 నెలల చొప్పున మొత్తం 10 నెలల శిక్ష విధించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 9 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.90 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. స్థానికంగా పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వీరంతా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు తేలిందన్నారు. దీంతో సోమవారం వీరందరినీ నగరంలోని జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచామన్నారు. ఈ మేరకు విచారణ జరిపిన జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

11న అయ్యప్ప సన్నిధిలో ఆరాట్టు ఉత్సవం



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణపుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి జన్మదినం సందర్భంగా ఈ నెల 11న(శుక్రవారం) అరాట్టు ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖరెడ్డి తెలిపారు. శబరిమలలో ఆరాట్టు ఉత్సవం ఎలా నిర్వహిస్తారో ఇక్కడ కూడా అదే సంప్రదాయం, పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. స్వామివారికి అభిషేకాలతో పాటు విశేష పూజలు జరపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

రేపు పింఛన్‌దారుల సంఘం సమావేశం

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల పెందుర్తి యూనిట్ సమావేశం చినముషిడివాడ సమీపంలోని చాణక్యనగర్ రామాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు అల్లం కృష్ణారావు, వై.కామరాజు తెలిపారు. సమావేశంలో పింఛన్‌దారుల సమస్యలు, ఇతరత్రా అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఇళ్ల స్థలాల కోసం ధర్నా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలోని ఇంటి స్థలాలు, ఇళ్లు లేని నిరుపేదల కోసం జీవో 30 ప్రకారం ఇంటి పట్టాలు ఇవ్వాలని, గతంలోని జీవో 296 ప్రకారం పట్టాలు రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి బి.జగన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరగనున్న ధర్నాలో స్థానిక పార్టీ ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాల్సిందిగా కోరారు.

అవగాహనతోనే ఆరోగ్య సంరక్షణ



మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడిన వైద్య శాఖ సిబ్బంది, విద్యార్థులు



వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

పరవాడ: వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, ప్రజల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. మంచి అహార అలవాట్లు, పరిశుభ్రత పాటించేలా ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఇక్కడి మూడు రోడ్ల కూడలిలో వైద్య సిబ్బంది మానవహారంగా ఏర్పడి ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కనకప్పారావు, వైద్య సిబ్బంది వి.సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవాలపై పోటీలు



పోటీల్లో గెలుపొందిన విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

పరవాడ: జేఎస్‌పీసీ, మ్యూచువల్లీ ఎయిడెడ్ సోసైటీ ఫర్ రిస్క్ మెడికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం లంకెలపాలెం, పరవాడ, తానాం పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు 79 వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. జెట్టి సుబ్బారావు, ఎస్.అప్పారావు, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా కిడ్స్ కాన్వొకేషన్ డే



చిన్నారులతో జీఎం రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో కిడ్స్ కాన్వొకేషన్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఆడిపాడి సందడి చేశారు. అనంతరం వైద్యురాలు సునీత, పాఠశాల జీఎం కె.రమ్య చేతుల మీదుగా విద్యార్థులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.స్వరూప, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.